# దెబ్బ తిన్న వరి, పత్తి పంటల పరిశీలన





దుమ్ముగూడెం:దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న సీపీఎం బృందం, కరకగూడెం: వర్షానికి తడిసిన వరి పంట, ఆళ్లపల్లి: తడిసిన వరిని చూస్తున్న రైతు

బూర్గంపహాడ్, డిసెంబర్ 7: ప్రభావంతో రెండు రోజులు కురిసిన వర్షానికి, ఈదురుగాలులకు దెబ్బతిన్న వరి పంటను మండల వ్యవసాయాధికారి కర్నూరపు అనిల్‌కుమార్ గురువారం పరిశీలించారు. మండలంలోని బూర్గంపహాడ్, ఉప్పుసాక, ఒడ్డుగూడెం, మోరంపల్లిబంజర్ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటివరకు 100 నుంచి 150 ఎకరాల్లో వరి, మిరప పంటలకు నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. రైతులు నీరు, ప్రవాహం తగ్గిన తర్వాత వరిని కట్టలుగా కట్టి నిలబెట్టుకోవాలని, వరి గింజలు మొలకరాకుండా లీటర్ నీటిలో 20గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏవో వెంట ఏఈవో జేవీడీ ప్రసాద్, పవన్, నాగవైష్ణవి, ప్రేమ్, శంకర్, నాగరాజు, కృష్ణ, సుధాకర్, ఆర్‌బీఎస్ కోఆర్డినేటర్ మారం శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం మండలంలో...**

దుమ్ముగూడెం, డిసెంబర్ 7: మండలంలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి పంటలను సీపీఎం బృందం గురువారం పరిశీలించింది. మండలంలోని మారాయిగూడెం, భీమవరం గ్రామాల్లో పత్తి, మిర్చి, మొక్కజొన్న, అపరాలు పంటలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. వరదల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలని నూతన ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు యలమంచిలి రవికుమార్, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచిలి వంశీ, మర్మం చంద్రయ్య, సర్పంచ్ తోడెం తిరుపతిరావు, రైతులు అప్కా రామకృష్ణ, అర్జున్, కారం శ్రీరాములు, సోడి రమణ, వెంకమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.



కరకగూడెం: మోతే గ్రామంలో ధాన్యంపై పరదాలు కప్పిన రైతులు

**కరకగూడెంలో..**

కరకగూడెం, డిసెంబర్ 7: మూడు రోజులుగా తుఫాన్ రైతులకు కంటి మీద కనుకులేకుండా చేస్తుంది. వర్షంతో పాటు ఈదురుగాలులు వీస్తుండటంతో తాకిడికి రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. చేతికి వరి పంట రావడంతో కళ్లాలో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలీన్లు కప్పుకుని రక్షించుకుంటున్నారు. మరోవైపు పత్తి, మిరప పంటలకు వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. చలిగాలులతో ప్రజలు ఇంటికే పరిమతమవుతున్నారు.

### రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి



తుపాన్ ప్రభావంతో వరిపంటలు బాగా దెబ్బతిన్నాయి. నేను మూడు ఏకారాల్లో వరి వేశాను. వర్షానికి పంట నెలవరింది. రెండు ఏకరాల్లో వరి కోసి కుప్ప వేశాను. వర్షానికి పరదాలు కప్పినా ఫలితం దక్కలేదు. పంటపై ఆశ పెట్టుకున్నాను. ఇప్పుడు పూర్తిగా నష్టపోయాను. ప్రభుత్వమే మమల్ని ఆదుకోని పంటనష్టం ఇప్పించాలని కోరుతున్నాను.

**-బొమ్మల సత్యం రైతు, పెద్దురు, ఆళ్లపల్లి మండలం**

**ఆళ్లపల్లి మండలంలో..**

ఆళ్లపల్లి, డిసెంబర్ 7: తుపాన్ ప్రభావంతో మండలంలోని పలు ప్రాంతాల్లో వరి కోతలు కోసిన ధాన్యం పూర్తిగా తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కుప్పలు పెట్టిన రైతులు పరాదాలు కప్పిన వర్షానికి తడిసాయి. అదేవిధంగా పలుచోట్ల వరిపంట నేల కొరిగింది. వానకాలంలో సాగుచేసిన పంటల దిగుబడిపై ఆశలు పెట్టుకున్న రైతులకు వర్షాలు దెబ్బతీశాయి. పత్తి తడిసి నల్లగా మారింది. పూత, కాత దశలో ఉన్న కందికి పురుగు ఉధృతితో తెగులు సోకాయి.

## మంత్రి పొంగులేటిని కలిసిన శ్రీనివాసరెడ్డి



మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సామా శ్రీనివాసరెడ్డి

మణుగూరుటౌన్, డిసెంబర్ 7: పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మణుగూరు మండల కాంగ్రెస్ నాయకుడు సామా శ్రీనివాసరెడ్డి గురువారం హైదరాబాద్‌లోని పొంగులేటి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి శ్రమించిన ప్రతిఒక్కరికి అండగా ఉంటామన్నారు. సమిష్టికృషితో కష్టపడి పార్టీకోసం పనిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంపీ సంతోష్‌కుమార్‌ను కలిసిన రాజు



సంతోశ్‌కుమార్‌కు మొక్కను ఇస్తున్న రాజు

మణుగూరుటౌన్, డిసెంబర్ 7: రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోశ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌ఎన్ రాజు గురువారం ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి గ్రీన్‌ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కను బహూకరించారు. సంతోశ్‌కుమార్ నివాసంలో మొక్కలు నాటే కార్యక్రమంలో రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సందర్భం ఏదైనా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాలన్నారు.

## ఎమ్మెల్యే డాక్టర్ తెల్లంకు సన్మానం



ఎమ్మెల్యే తెల్లంను సత్కరిస్తున్న బుచ్చయ్య, బీఆర్‌ఎస్ నాయకులు

భద్రాచలం, డిసెంబర్ 7: భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన డాక్టర్ తెల్లం వెంకట్రావును చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య గురువారం కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం, వెంకటాపురం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అరికెల్ల తిరుపతిరావు, గంపా రాంబాబు తదితరులు ఉన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సుపరిపాలన



సీఎం రేవంత్‌రెడ్డితో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్, డిసెంబర్ 7: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు సుపరిపాలన అందుతుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి, నూతన మంత్రి వర్గ పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలోకి వెళ్తుందన్నారు.

## రాములోరి నిత్య కల్యాణం



కల్యాణం జరుపుతున్న అర్చకుడు

భద్రాచలం, డిసెంబర్ 7: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం రాములోరికి అర్చకులు నిత్యకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యపూజలు, నిత్య బలిహరణం, నిత్యహోమాలు కార్యక్రమాలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకొచ్చి సీతారాములకు కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

## ప్రధానోపాధ్యాయులకు శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

దుమ్ముగూడెం, డిసెంబర్ 7: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ఏజే ప్రభాకర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆశీర్వాదం హెచ్‌ఎంలకు యూడైస్ వల్ల కలిగే ఉపయోగాలపై శిక్షణ ఇచ్చారు. పాఠశాలలకు అవసరమైన వసతులు, మధ్యాహ్న భోజన పథకం, రాగిజావ, సీఎం బ్రేక్‌ఫాస్ట్, దివ్యాంగులకు మెటీరియల్ అందించే విషయంలో పలు చర్యలు తీసుకోవాలన్నారు. వారికి యూడైస్‌పై అవగాహన కల్పించాలని హెచ్‌ఎంలకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## నరసమ్మ సాహిత్యం ఎంతో గొప్పది

భద్రాచలం, డిసెంబర్ 7: అభినవ మొల్ల డాక్టర్ చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ సాహిత్యం చాలా గొప్పదని, విశ్వ తెలుగు సాహిత్య సంస్కృతి సభ, అట్లాంటా, అమెరికా కార్యదర్శి, మల్లినాథసూరి కళాపీఠం ఏడుపాయల సంస్థాన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ప్రముఖ కవి బీ వెంకట్, భద్రాచలం కళాపీఠం అధ్యక్షుడు, సప్తవర్ణాల సింగిడి సమీక్షకులు, వ్యాఖ్యాత భద్రాచలం ప్రముఖ కవి పేరిశెట్టి బాబు తెలిపారు. లక్ష్మీ నరసమ్మ మరణం సాహితీ లోకానికి బాధాకరమన్నారు. ఆమె రచనలు సమాజాన్ని ప్రతిబింబించే ఉత్తమ గ్రంధాలని చెప్పారు. వారి మృతికి సంతాపాన్ని తెలిపారు.

## 10న పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన

సారపాక, డిసెంబర్ 7: మండలంలోని ఇరవెండి శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆదివారం భద్రాద్రి శ్రీమార్కండేయ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించనున్నట్లు ఆ సంఘం నిర్వాహకులు గంగాధర్, చందనాల రవీందర్, జీ శ్రీనివాసరావు, జే రాజేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ వనభోజన కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరుకావాలని వారు కోరారు.

## పాత ఎంపీడీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన రికార్డు రూంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, డిసెంబర్ 7: పట్టణంలోని మండల ప్రత్యేక అధికారి కార్యాలయం, పాత మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. రికార్డు రూంలోని రికార్డులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని అధికారులను ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని పట్టణ సీఐని ఎమ్మెల్యే వెంకట్రావు ఆదేశించారు. షార్ట్ సర్క్యూట్ జరిగిందా? ఎవరైనా కావాలని రికార్డు రూం ను తగలబెట్టారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు

పినపాక, డిసెంబర్ 7: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు, అంతర్గత రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలన్నీ జలమయమయ్యాయి. మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామ సిబ్బందితో పారిశుధ్య పనులు నిర్వహించారు. వీధుల్లో, రహదారులకిరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఆశ్రమ పాఠశాలల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అదేవిధంగా రోడ్లపై నిలిచిన నీటిని కాలువలు తీసి బయటికి పంపించారు. చేతిపంపులు, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించారు.

## అనధికారికంగా బ్రిడ్జి నిర్మాణం

మణుగూరుటౌన్, డిసెంబర్ 7: మండలంలోని కమలాపురం-అన్నారం గ్రామాల మీదుగా చినరావిగూడెం ఇసుక ర్యాంపునకు వెళ్లే రహదారిపై ఇసుక ర్యాంపు గుత్తేదారు ఇసుక తరలించేందుకు అనువుగా అనధికారికంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో వరదనీరు చేరి పంటలు నీటమునిగాయి. దీంతో రైతులు తమ పంటలకు నష్టపరిహారం అందించి, న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. వరి, పత్తి, మిరప పంటలు వరదనీటిలో మునిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.